
# ప్రపోజల్



ఫిబ్రవరి 25:

"మీది మరీ చాదస్తం మేడమ్! ఆఫీసు పనిలో మీతోపాటు లేటవర్స్‌లో కూచుని మీకు హెల్ప్ చేశానే అనుకోండి. అంతమాత్రాన హోటల్‌కి లాక్కొచ్చి కాఫీ ఇప్పించాలా? మన అటెండర్ వీర్రాజుని తెమ్మంటే తెచ్చేవాడుగా. అయినా సెక్షన్‌లు వేరయినా ఒకే ఆఫీసు వాళ్లం, మనలో మనకి ఈ పట్టింపులేమిటండీ?"

"అందుకోసమే కాదు, మీరు నాతో ఏదో చెబ్దామనుకున్నారులా ఉంది. వీర్రాజు పక్కనే ఉన్నాడు గనుక చెప్పలేకపోయారేమోననీ, ఇక్కడైతే మనకు తెలిసున్న వాళ్లు ఎవరూ ఉండరు కదాని..."

ఎమ్బీయస్ ప్రసాద్

"అదా... ఏం లేదులెండి, తర్వాత చెప్తానులెండి!"

మార్చి 14:

"మీకు ఫార్మాలిటీస్ ఎక్కువ మేడమ్! మీకు కావలసిన రికార్డేదో నాకు చెబితే తెచ్చిపెట్టేవాణ్నిగా... ఈ రికార్డ్స్ రూంలో గాలీ, వెలుతురూ సరిగ్గా ఉండి చావవు. వీర్రాజుకి చెబితే 'ఆ గదిలోకి వెళ్లి మీక్కావలసింది నేను తేలేను, సరిగ్గా ఏదీ కనబడిచావదు' అని మమ్మల్నే వెదుక్కోమంటాడు. మీరు కూడా అవస్థ పడ్డం ఎందుకు? మీక్కావలసింది చెపితే నేను వెదుకుతానుగా.... మీకు బయటకు వెళ్లండి!"

"దగ్గర్లో ఎవరూ లేరనీ, చీకటిగా ఉందని మరీ మరీ నొక్కి చెబుతున్నారు. కౌగలించుకుని గట్టిగా ముద్దు పెట్టేస్తానని బెదిరిస్తున్నారా?"

"ఛ! ఛ!... మీరు తప్పుగా అర్థం చేసుకుంటున్నారు మేడమ్, నేనలాంటివాడిని కాదని మీకు తెలీదా?"

జూన్ 8:

విమల పద్ధతి నాకు నచ్చలేదు. తనంటే నాకు బోలెడు ఇష్టమని గ్రహించదేం? ఆమెను తానెంతగా ఆరాధిస్తున్నాడో తెలుసుకోదేం? మా పరిచయంలో తనతో ఎన్నెన్ని గంటలు, ఎన్నెన్ని రోజులు కబుర్లు చెప్పాను?

'నిన్ను ప్రేమిస్తున్నాను' అని నేను నోరు విప్పి చెప్పలేదు కానీ నా భయం నాది. 'నువ్విలాంటి వాడివనుకోలేదు. స్నేహంగా, సన్నిహితంగా దగ్గరకు వస్తే ఇలా ప్రవరిస్తావా' అని ఝాడిస్తే? ఈ భయమే లేకపోతే మనం పెళ్లి చేసుకుందామని ఎప్పుడో ప్రపోజ్ చేసేవాణ్ని.

కానీ ఆర్నెల్ల మా స్నేహానికి విలువివ్వకుండా, మొన్న శనివారం ఆఫీసు ఫంక్షన్లో మోహన్‌గాడితో కబుర్లలో మునిగిపోయింది. వాళ్ల పక్కకి వెళ్లి నిలబడితే కనీసం చూడనైనా చూడలేదు. పలకరిస్తే మొహమాటానికి ఓ చిరునవ్వు పడేసి, మళ్లీ వాడితో కబుర్లలో పడింది. నాకూ కోపం వచ్చింది. ఉక్రోషం వచ్చింది. అందుకే మర్నాడు వాళ్ల సెక్షన్‌కెళ్లి తనని పలకరించకుండానే శాంతితో కబుర్లు చెప్పాను. బోలెడు జోక్స్ వేశాను. అఫ్‌కోర్స్, ఒకటి రెండు సార్లు నవ్వుతూ నవ్వుతూ శాంతి భుజమ్మీద చేయి కూడా వేశాను. ఇదంతా విమల నుడికిద్దామనే! అంతమాత్రానికే ఆవిడకి కోపం వచ్చిందిట. నాతో మాటలు మానేసింది.

రెండ్రోజులయ్యాక శాంతి వచ్చి, "విమల చాలా ఫీలవుతోంది. వెళ్లి నచ్చచెప్పు!" అని చెప్పింది.

చిలికి చిలికి గాలివానవుతుందని భయపడి నేనే నిన్న మళ్లీ వెళ్లాను తన దగ్గరికి. టైము లేదంది.., ఊరెళ్లుతోందట. ఆఫీసులో పని పూర్తి చేస్తే గానీ లీవు ఇవ్వనన్నాడట ఆఫీసరు. ఆ పనేదో నేను చేసిపెడతానన్నాను. అక్కర్లేదంది. ఏ ఊరు వెళ్తున్నావంటే వైజాగంది. వాళ్ల అక్కయ్య కూతురు బారసాల హఠాత్తుగా పెట్టారట. వెంటనే వెళ్లి టికెట్ బుక్ చేసిందట. 'ఎల్టీసీ ఉపయోగించుకుందామని ఫస్ట్‌క్లాస్‌లో కొన్నాను' అని చెప్పి ఫైళ్లలో మునిగిపోయింది.

సాయంత్రం నాంపల్లి స్టేషన్‌కెళ్లాను. ట్రెయినంతా వెదికాను. ఫస్టుక్లాసు లిస్టులో తన పేరే కనబడలేదు. నా మనసంతా ఆందోళన. 'అసలు గోదావరేనా? లేక వేరే ట్రెయినా? నేను పొరపాటుగా విన్నానా?' అని ఆలోచిస్తూండగా విమల కనబడింది.

"ఏం ఇలా వచ్చారు? మీ వాళ్లెవరైనా వెళ్తున్నారా?" అని అంది సీరియస్‌గా. వెటకారం లేదు. "మీతో మాట్లాడాలనే వచ్చాను" అంటే ఆశ్చర్యపడింది. నేను మాట్లాడబోయేటంతలో విమల ఫస్టుక్లాసు పాసెంజర్ల లిస్టు చూస్తూ, "ఇక్కడెందుకు లోపల కూచుని మాట్లాడుకుందాం రండి!" అంటూ కంపార్టుమెంటులోకి ఎక్కింది. 'ఎఫ్' కాబిన్‌లోకి వెళ్తూ, "ఎవరో 'మిస్టర్ అండ్ మిసెస్ రావ్' అని

ఉంది. సికింద్రాబాదులో ఎక్కుతారు కాబోలు అంతవరకూ మనం కూచుని మాట్లాడుకోవచ్చు, రండి!" అంది.

నాకు లోపల్నుంచి దుఃఖం తన్నుకొస్తోంది. మాటలు తట్టడం లేదు. తట్టినవి పైకి పెగలడం లేదు. సికింద్రాబాదు వచ్చేలోగా చెప్పగలనో, లేదోనన్న జంకు ఎక్కువైనకొద్దీ, ఏం మాట్లాడాలో కూడా తెలీకుండా పోతోంది. నా పెదాలు కదులుతున్నాయి గానీ వాటి అర్థం నాకే తెలీటం లేదు. విమలకింకేం అర్థమవుతుంది? అసలు విమల వింటోందో, లేదో కూడా నాకు తెలీటం లేదు.

సికింద్రాబాద్‌లో టీటీఈ వచ్చాడు.

విమల తన పర్సులోంచి టికెట్ తీసి ఇచ్చింది.

"మిస్టర్ అండ్ మిసెస్ రావ్" అంటూ మా ఇద్దర్నీ చూసి తన లిస్టు చూసుకుని టిక్కు పెట్టుకుని పక్క కాబిన్‌లోకి వెళ్లిపోయాడు. రైలు కదిలింది.

నాకు మతిపోయింది. నోరు వెళ్లబెట్టుకుని నేనుంటే విమల లేచి కిటికీ తలుపు బోల్టు వేసి, "రండి రావుగారూ! మీకు పై బెర్తు కావాలా? కిందిది కావాలా?" అని అంది నవ్వుతూ. నాకర్థమయింది.

"నేను స్టేషన్‌కొస్తానని ఇంత పక్కాగా ఎలా తెలుసు?" అనడిగాను.

"మీరెంత బెంగ పెట్టుకున్నదీ శాంతి చెప్పింది. రాకుండా ఎలా ఉంటారని మీకూ టికెట్ తీసుకున్నాను. అన్నట్టు... మీకు అనుకోని ప్రయాణం. వైజాగ్‌లో బట్టలు కొనవచ్చు. అందాకా ఈ బట్టలు మాపుకోకండి!"

"మీవీ మాపుకోకండి నా బట్టల పక్కనే పడేయండి.!" అన్నాను వెక్కిరిస్తూ.

"సిగ్గులేకపోతే సరి. మొహం చూడండి బభ్రాజమానంలా! ఎక్కడ దొరికాడ్రా బాబూ ఈ బుద్ధావతారం!" అంది నుదురు కొట్టుకుంటూ.

ఆమెను దగ్గరికి లాక్కుని, "వీడు భజన గోవిందం కూడా!" అన్నాను.

తెల్లారుఝామున అనకాపల్లి చేరుతుండగా కాబోలు, "శోభనప్పెళ్లి కొడుకుగారూ! ఇప్పటికైనా పెళ్లి ప్రపోజల్ చేస్తారా?" అంది నా చెవిని మునిపంటితో కొరుకుతూ.

●

(ఆంధ్రప్రభ వీక్లీలో జులై 1998)

# ఆలూమగలీయం

## ది క్లింటన్స్ ఆర్ కమింగ్!
## గ్ంమిక ర్ఆ న్స్టంక్లి ది!!

> మార్చి, 2000లో అమెరికా అధ్యక్షుడు క్లింటన్ భారత్ పర్యటన
> సందర్భంగా వామపక్షాల నిరసన ప్రదర్శనలు-వార్త

"ఇదిగో సావిత్రీ, ఎక్కడున్నావ్? కాస్త మంచినీళ్లు అందుకో"

"వస్తున్నా, వస్తున్నా! వీధిలోంచే ఆ అరుపులేమిటి? ఏదో నిరసన ప్రదర్శనలో నినాదాలిచ్చినట్టు!"

"కరెక్టుగా ఊహించావు! క్లింటన్ రాకకు వ్యతిరేకంగా మేమంతా డిమాన్‌స్ట్రేషన్ ఇచ్చి వచ్చాం. అందుకే శోష వచ్చి కాస్త నీళ్లు తగలేయమంటున్నాను."

"అత్త మీద కోపం దుత్త మీద అన్నట్టు, క్లింటన్ మీద కోపం ఇంటిదానిమీదనా? ఆ కంఠశోషలిజానికి వెళ్లమన్నదెవరు? వచ్చి నా మీద ఎగరమన్నదెవరు?"

"అందుకే మరి స్త్రీలకు రాజకీయ చైతన్యం లేకపోవడం శోచనీయం అంటాను. ఒక సామ్రాజ్యవాది, దురంహకారి తగుదునమ్మా అంటూ వస్తే మనం చేతులు ముడుచుకు కూచోవాలా? దేశ ప్రతిష్ఠ మంట గలిసిపోతూ ఉంటే, వెళ్లి నిరసన తెలపకపోతే ఎలా?"

"తెలిపితే ఏమయిందంట? ఆయన రావడం మానేసాడా? అసలు మీరు అరిచిన అరుపులు ఆయన దాకా చేరాయో లేదో? వాటి అర్థం క్లింటన్‌కు తెలుసో? లేదో!"

"దద్దమ్మలా మాట్లాడకు. మన కోసం క్లింటన్ తెలుగు నేర్చుకుంటాడా? ఎవరో తర్జుమా చేసి చెప్తారు. చొప్పదంటు ప్రశ్నలు మాని నీళ్లు పట్టుకురా.."

"దద్దమ్మలా అడుగుతున్నాననుకోండి. ఎవరైతే మాత్రం 'మిమ్మల్ని ఫలానా, ఫలానా బండబూతులు తిట్టారండి' అని ఆయనకు చెప్తారంటారా?"

"గొప్ప లాజిక్కే లాగుతున్నావులే! తిట్లు అర్థం కాకపోయినా, దిష్టిబొమ్మ అచూసి అర్థం చేసుకుంటాడుగా!"

"ఏం దిష్టిబొమ్మలో ఏమో, అన్నీ ఒకేలా 'తగలబడతాయి'. దేనికీ రూపురేఖలుండవు. 'అది మనదేస్మా' అని వాటినెలా గుర్తుపడతారు చెప్మా!?"



"అంత ఆశ్చర్యపడి పోయేసేయకు! అందుకే దానికి డ్రస్సు తొడుగుతారు. దాన్ని బట్టి తెలుస్తుంది. నెత్తిమీద అంకుల్ శామ్ టోపీ పెడితే అది అమెరికా సామ్రాజ్య వాదం గుర్తన్నమాట! జార్జి వాషింగ్టన్ నుంచి క్లింటన్ దాకా అందరూ కవర్ అయిపోతారు దాంతో!"

"ఆ టోపీ బలే ముచ్చటగా ఉంటుందండీ కాల్చేసే ముందు అది విడిగా తీసేసి పట్టుకు రాక పోయారా?"

"సావిత్రీ, నిజం చెప్పమంటావా? ఇవాళ ఆ టోపీ దొరకలేదు. ఆ దిష్టిబొమ్మను అమెరికనైజ్ చేయడానికి చాలా కష్టపడాల్సి వచ్చింది..."

"...అవునూ, మీ చొక్కా మారిందేమిటి?"

"అదే చెప్పవస్తున్నా, అమెరికాకు గుర్తుగా ఏముంటుందా అని వెతుకుతూంటే 'ఒరే రాజా నీకు 'ఏరో' షర్టు ఉందిగా, ఇవ్వరా' అన్నాడు జగదీశ్ గాడు. వద్దంటున్నా వినకుండా.."

"...లాక్కొని బొమ్మకి తొడిగి దాంతోబాటు తగలేసారు. మీరు ఇంకో చొక్కా కొని డబ్బు తగలేసారు. అంతేనా?"

"సారీ మైడియర్! సర్టెన్ థింగ్స్ వి కాంట్ హెల్ప్ యూనో"

"నో, నో. అది మీ పాకెట్‌మనీలోంచి కట్ చేయాల్సిందే! మీ భారతదేశం క్లింటన్‌ని ఎలాగూ అప్పడగబోతోంది, మీరూ అప్పడగండి, చొక్కా ఖరీదు! ఆయన ఏదైనా విదిల్చినా విదల్చవచ్చు. అవునూ, మనదేశం నుంచి ఎవరైనా వెళితే పైదేశాల వాళ్లు నిరసనగా లాల్చీలు, తలపాగాలు తొడిగిన దిష్టిబొమ్మల్ని తగలేస్తారాండీ?"

"అబ్బే, అలాటివేమీ చెయ్యరు!"

"అదేమిటి, వాళ్లకు దేశభక్తి లేదా? మనవాళ్లు – స్వదేశీ, సోషలిస్టు, కమ్యూనిస్టు, ముఖ్యమంత్రులు ప్రధానమంత్రులు ఇంతమంది వెళుతున్నారు. ఏ గొడవా లేకుండా రానిస్తున్నారా వాళ్లని!? నా లాగే ఆ దేశాల వాళ్లకీ చైతన్యం లేదంటారా?"

"ఈ వెటకారాలు కట్టిపెట్టి మంచినీళ్లు పట్టుకురా! ఇందాకటి నుంచీ చెపుతున్నా. గొంతెండిపోతోంది."

"క్లింటన్ మీద కేకలేయడం కాదు. చూసి నేర్చుకోండి. ఇంకోళ్ల ఇంటికి వస్తూ కూడా ఆహితాగ్నుడిలా తన నిప్పూ, నీళ్లూ తానే తెచ్చుకున్నాడు. అంత గొంతెండిపోయేవాళ్లు మీరూ పట్టుకెళ్లాల్సింది మంచినీళ్లు. ఎక్కడికి పోతాయి బుద్ధులు? మీ అక్కగారు మన ఇంటికి వచ్చినప్పుడు వారం రోజులు ఉండాల్సి వచ్చినా ఒక్క దుప్పటీ, తువ్వాలూ కూడా తెచ్చుకోదు. ఈసారి రానీయండి చెప్తాను – 'క్లింటన్ దగ్గర కెళ్లి పాఠాలు నేర్చుకో తల్లీ' అని గట్టిగా బుద్ధి చెప్తాను..." ఆడబడుచు అక్కడున్నట్టే విరుచుకుపడింది సావిత్రి!